క్లుప్తంగా

లక్ష్మీనారాయణస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కోరుట్ల: పట్టణంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవం అర్చకులు పాలెపు భరద్వాజ శర్మ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సతీమణి సరోజన, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, ఎంపీపీ తోట నారాయణ, వైస్ ఎంపీపీ చీటి స్వరూప, ముత్యాల సంఘం ప్రతినిధులు ఖమ్మం భాలయ్య, పసులోటి జైనారాయణ, పసులోటి శ్రీనివాస్, వెంకటేశం, బాలరాజ్, ప్రవీన్, వెంటకరమణ పాల్గొన్నారు.

నేరాలపై అవగాహన ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మెట్‌పల్లి: సమాజంలో మహిళలపై జరుగుతున్న నేరాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని షీ టీం ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని వెంకట్రావ్‌పేటలో ఉన్న జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం షీ టీం, సైబర్ క్రైం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ అంశాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలపై అవగాహన ఉంటే వాటి బారిన పడకుండా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై వాలీబేగ్, ప్రిన్సిపాల్ కోటగిరి ఆనందం, ఏటీపీ స్వరూప, సైబర్ క్రైమ్ కానిస్టేబుల్ సౌజన్య పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కోరుట్లరూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అందించాలని టీపీసీసీ నాయకుడు కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వడగళ్ల వానతో నియోజకవర్గంలో మామిడి, వరి, మిర్చి, నువ్వు, పెసరు, అలిసెంత, మొక్కజొన్న పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎకరానికి రూ.50వేల చొప్పున పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుగంటి శంకర్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎర్దండి మోహన్‌రెడ్డి, రెహమాన్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి రూ.15వేల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని శివ గాయత్రి అనాథ వృద్ధాశ్రమానికి దాతలు రూ.15వేలు ఆశ్రమ నిర్వాహకుడు సూరజ్ శివ శంకర్‌కు ఆదివారం అందజేశారు. జిల్లా కేంద్రానికి చెందిన పెద్ది పాపయ్య జ్ఞాపకార్థం అతని భార్య వజ్రమ్మ రూ.5వేలు, నీలి కాశీనాథం జ్ఞాపకార్థం ఆయన భార్య సరోజ రూ.5వేలు, గుండ కాంతయ్య జ్ఞాపకార్థం ఆయన భార్య గంగాభవాని రూ.5వేలు అందజేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, ఆశ్రమ సభ్యులు కాలగిరి బాపురెడ్డి ఉన్నారు.

నిత్యావసరాలు అందజేత



రాయికల్: పట్టణంలోని అరవై మంది నిరుపేద కుటుంబాలకు మహ్మద్ ఆలీ మెమోరియల్ ట్రస్ట్, ముస్లిం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. అధ్యక్షుడు సోహెల్, నాయకులు సబీల్, మహ్మద్, షకీల్, అజీముద్దీన్, జాహెద్, రషీద్, ఫజిల్, రాహుఫ్, ఫక్రుద్దీన్, కడకుంట్ల జగదీశ్వర్, ఎద్దండి ముత్యం రాజురెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు తాత్కాలిక బ్రేక్

- కంపా నిధులు అందడంలో జాప్యం
- అడవుల్లో నిలిచిన అభివృద్ధి పనులు



సారంగాపూర్ అటవీప్రాంతంలో కంపా నిధులతో నిర్మించిన మినీ పెర్కోలేషన్ ట్యాంక్

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో ఉన్న అడవుల్లో ఏటా చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులకు తాత్కాలికంగా బ్రేక్ పడుతోంది. కేంద్ర ప్రభుత్వం అడవుల అభివృద్ధికి ఏటా వెచ్చించే కంపా నిధులు జమ అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వీటిని విడుదల చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం వీటిని విడతల వారీగా విడుదల చేస్తుండడంతో పనుల ప్రారంభానికి జాప్యం అవుతోంది.

కంపా నిధులు అంటే..

రాష్ట్ర ప్రభుత్వం అటవీప్రాంతాల్లో ప్రాజెక్టుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనుల కోసం అటవీ భూములను సేకరిస్తుంది. ఇందుకు అటవీశాఖకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న భూమికి బదులు భూమి లేదా, అంత విలువైన డబ్బును జమ చేయాల్సి ఉంటుంది. ఈ నిధులను అటవీశాఖ తిరిగి అడవుల అభివృద్ధికి వివిధ కార్యక్రమాల కింద ఖర్చు చేస్తుంది.

కంపా నిధులతో చేపడుతున్న పనులు..

కంపా నిధులతో అడవుల్లో ఏటా భూగర్భ జలాల పెంపునకు మొదటి ప్రాధాన్యం ఇచ్చే పనులు చేపడుతుంది. ఇందులో వర్షాలు విస్తారంగా కురవడానికి మొక్కలు పెంచడం, చెట్లు ఏపుగా పెరగడానికి వాటి పక్క కొమ్మలు కత్తిరించడం పనులు చేపడుతారు. వీటితో పాటు అడవుల్లో వర్షాకాలంలో గుట్టలపై నుంచి వచ్చే నీటిని వాగుల్లోకి వెళ్లకుండా అక్కడికక్కడే నిల్వ చేసేలా రాళ్లతో రాతి కట్టడాలు (రాక్‌ఫిల్ డ్యాం) నిర్మాణం, వేసవిలో వన్యప్రాణులు దాహం తీర్చుకోవడానికి చిన్న చిన్న సాసర్లు ఏర్పాటు చేయడం, నీటి నిల్వ పెంచడానికి, వన్యప్రాణులు నీటిని తాగడానికి చిన్న, పెద్ద నీటి నిల్వ కుంటలు, చెక్‌డ్యామ్‌లు, కాంటూర్ కందకాలు, సమతుల కందకాలు, ప్లాంటేషన్లు ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపడుతారు.

సారంగాపూర్‌లో రూ.20లక్షల పనులు

సారంగాపూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో విస్తరించిన అడవుల్లో దాదాపు రూ.20లక్షల విలువ చేసే పనులను పూర్తి చేశారు. ఇందులో రూ.లక్ష, రూ.2లక్షలు వెచ్చించి అడవుల్లో అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో చిన్న చిన్న నీటి ట్యాంకులను నిర్మించారు. వీటితో పాటు గట్ల వెంట మొక్కలు నాటడం, అడవుల్లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడం, ఎక్కువ విస్తీర్ణంలో ఖాళీగా ఉంటే అక్కడ 5, 10 హెక్టార్లలో వివిధ ఔషధ మొక్కలతో ప్లాంటేషన్లు ఏర్పాటు చేయగా అవి ఇప్పుడు ఏపుగా పెరిగాయి. ఈ ఏడాది కూడా మరో రూ.20లక్షలతో పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు చేశారు. వివిధ సాంకేతిక కారణాలతో ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు.

నిధులు రాగానే పనులు చేపడతాం



నిధులు అందగానే పనులు చేపడతాం. ఇప్పటికే పనులు ఎక్కడ చేపట్టాలన్న దానిపై ప్రతిపాదనలు చేశాం. అడవుల అభివృద్ధే ధ్యేయంగా పనులు సాగుతాయి.

– మహేశ్, సెక్షన్ అధికారి, సారంగాపూర్

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్



చెక్కు అందజేస్తున్న మంత్రి ఈశ్వర్

గొల్లపల్లి: కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన బుర్ర శ్రీనివాస్ గత ఏడాది అక్టోబర్‌లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బీఆర్‌ఎస్ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును మంత్రి మృతుడి భార్యకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాఘం శంకరయ్య, ఎంపీటీసీ మధుకర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు బుర్ర తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోం

గొల్లపల్లి: ప్రతిపక్ష పార్టీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోమని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్‌పై ఆరోపణలు చేయడాన్ని మంత్రి ఖండించారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు ఉపయోగపడుతోంది

పెగడపల్లి: సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద అందిస్తున్న ఆర్థికసాయం పేదలకు ఎంతగానో ఉపయోగ పడుతోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఈ మేరకు మండలంలోని మద్దులపల్లికి చెందిన కల్లెం లలితమ్మ అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకుంది. దీంతో మంత్రి ఈశ్వర్ చొరవతో బాధితురాలికి రూ.1,05,000 మంజూరయ్యాయి. అట్టి చెక్కును ఆదివారం కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బాధితురాలి భర్త ప్రతాపరెడ్డికి అందజేశారు. అదేవిధంగా గ్రామంలో గౌడ కులస్తుల సంఘం భవన నిర్మాణం కోసం రూ.5లక్షల మంజూరు పత్రాన్ని గౌడ సంఘం నాయకులకు అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు తిరుపతిరెడ్డి, కిషన్, సంతోష్, తిరుపతి, శ్రీనివాస్, వెంకటేశ్, తిరుపతిగౌడ్, స్వామి, చంద్రయ్య, భూమయ్య, అంజయ్య పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న పంటల పరిశీలన



కథలాపూర్: నువ్వుల పంట పరిశీలిస్తున్న ఏఈవో



బుగ్గారం: పంటను పరిశీలిస్తున్న అధికారులు

వెల్గటూర్: వర్షానికి దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, నువ్వు పంటలను ఏఈవో వినోద్ ఆదివారం పరిశీలించారు. ఎండపల్లి మండలం గొడిశెలపేట క్లస్టర్ పరిధిలోని గొడిశెలపేట గ్రామంలో శనివారం కురిసిన వర్షానికి 11 ఎకరాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా నష్టపోగా, ముంజంపల్లి, మారేడ్‌పల్లి, ఉండెడ, శానబండ గ్రామాల్లో 105 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు ప్రాథమిక అంచనా వేశారు. ఏఈవో వినోద్, గొడిశెలపేట ఉపసర్పంచ్ శ్రీనివాస్, రైతులు దేవేందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

కథలాపూర్‌లో..

కథలాపూర్: మండలంలోని కలిగోట, తుర్తి గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన వడగళ్ల వర్షంతో నష్టపోయిన పంటలను ఏఈవో శేఖర్, స్థానిక ప్రజాప్రతినిధులు ఆదివారం పరిశీలించారు. కలిగోటలో 52 ఎకరాల్లో వరి, తుర్తిలో 43 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. కలిగోటలో 23 ఎకరాల్లో నువ్వుల పంటకు నష్టం జరిగిందని వెల్లడించారు. నష్టపోయిన పంట వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఏఈవో శేఖర్ పేర్కొన్నారు.

బుగ్గారంలో..

బుగ్గారం: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన వడగళ్ల వానతో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. ఈసందర్భంగా ఆదివారం వ్యవసాయాధికారులు మండలంలోని గ్రామాల్లో పర్యటించారు. మండలంలో మొత్తం 200 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ఏడీఏ రాంచంద్రం వెల్లడించారు. ఆయా గ్రామాల సర్పంచులు బత్తుల తిరుపతి, కారకూరి రాధ, దుమ్ము లతాశ్రీ, ఏఈవో శ్రీనివాస్ ఉన్నారు.

ఆస్తి పన్ను స్వచ్ఛందంగా చెల్లించాలి



మేళా నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

జగిత్యాల: ఇంటిపన్నును స్వచ్ఛందంగా చెల్లించాలని మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని పలు వార్డుల్లో కమిషనర్ నరేశ్ ఆధ్వర్యంలో రెవెన్యూ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ మేళాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆస్తిపన్నును సకాలంలో చెల్లిస్తే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లికార్జున్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లం, ఆర్‌వో ప్రసాద్ పాల్గొన్నారు.

నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లు



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: సిల్వెల్ కార్పొరేషన్ ప్రైవేట్ సంస్థ సహకారంతో పట్టణ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేద మహిళలకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పార్టీ అధ్యక్షుడు గట్టు సతీశ్, కౌన్సిలర్లు కప్పల శ్రీకాంత్, బొడ్ల జగదీష్, నాయకులు ఎర్రవెల్లి సురేశ్, మంచాల కృష్ణ, పబ్బ శ్రీనివాస్, సమిండ్ల శ్రీనివాస్, చకినం కిషన్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

జగిత్యాల: పట్టణంలోని 28వ వార్డుకు చెందిన వనితకు ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.2.50లక్షల విలువ చేసే ఎల్‌వోసీని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పంబాల రామ్‌కుమార్, దావ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలి



మాట్లాడుతున్న తిరుపతి

సారంగాపూర్: ప్రజల సమస్యలపై వెంటనే స్పందించాలని బీజేపీ బీర్‌పూర్ మండల ఇన్‌చార్జి పడాల తిరుపతి కోరారు. ఈ మేరకు ఆదివారం బీర్‌పూర్ మండలం సిరిపురం గ్రామంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ బియ్యం, మిషన్ భగీరథ, పింఛన్లు, అంగన్‌వాడీ సమస్యలపై కార్యకర్తలు ప్రస్తావించగా, వీటిపై ఆయన కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సమావేశంలో మండల అధ్యక్షుడు మ్యాడ జనార్దన్, ప్రధాన కార్యదర్శులు ఆడెపు రమేశ్, అప్పాల జలేందర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బసవరాజుల సంతోష్, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు ఆడెపు సత్తయ్య పాల్గొన్నారు. అనంతరం స్వశక్తి కేంద్ర అభియాన్ బీర్‌పూర్ మండల అధ్యక్షుడిగా సింగం రాకేశ్, కార్యదర్శిగా కందుకూరి కొమురేశ్‌ను నియమించి వారికి నియామక పత్రాలు అందించారు.

వైభవంగా పార్వతిపరమేశ్వరుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గొల్లపల్లి: మండలంలోని చిల్వాకోడూర్ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉగాదిని పురస్కరించుకుని జరిగే జాతరలో భాగంగా అర్చకులు నవీన్ శర్మ, భాస్కర్, గణేశ్ కల్యాణం వైభవంగా నిర్వహించారు. రంగనర్సింహ స్వామి, పప్పుల వెంకన్న దంపతులు అన్నదానం చేశారు. సర్పంచ్ కందుకూరి పద్మావతి రవీందర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు దాసరి తిరుపతిగౌడ్, ఉపసర్పంచ్ నక్క ఏశయ్య, ఎంపీటీసీ షేక్ మహబూబ్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు సింగారపు కొమురయ్య పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



విద్యార్థుల నృత్యాలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్‌లో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనికారావు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ఉచిత రక్తనమూనా శిబిరం

కోరుట్ల: కోరుట్ల బిలాల్‌పురా వెల్ఫేర్ సొసైటీ అధ్వర్యంలో కోరుట్ల సేవాదళ్ సౌజన్యంతో ఆదివారం శ్రీసాయి దంత వైద్యశాల వైద్యులు సిరికొండ శ్రీనివాస్ ఉచిత రక్తనమూనా శిబిరం, దంత వైద్య శిబిరం నిర్వహించారు. సేవాదళ్ అధ్యక్షుడు పుప్పాల నాగరాజ్, బిలాల్‌పురా యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అర్షద్‌ఖాన్, ఉపాధ్యక్షులు సాజిద్, అఖిల్, కార్యదర్శి సోహైల్, సహాయ కార్యదర్శి అఫ్రోజ్, వాజీద్, సాల్మన్, రఫీ, షఫీ తదితరులు పాల్గొన్నారు.

✦21న మైనార్టీ రుణాలకు డ్రా

కోరుట్ల: కోరుట్ల మున్సిపల్ పరిధిలో మైనార్టీ రుణాల కోసం 792 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా మంగళవారం డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అయాజ్ తెలిపారు. దరఖాస్తుదారులు మంగళవారం ఉదయం 11 గంటలకు కటుకం సంగయ్య ఫంక్షన్‌హాల్‌లో హాజరుకావాలని సూచించారు.

✦కథలాపూర్‌లో ప్రతీ సోమవారం ప్రజావాణి

కథలాపూర్: కథలాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంట వరకు ఉంటుందన్నారు.

✦నేడు రాయికల్ మున్సిపల్‌లో..

రాయికల్: పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్‌లో ప్రతీ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగుల సంతోష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

✦జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు

రాయికల్: మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన ఇంద్రాల నీషత్ అనే యువకుడు ఇటీవల రాయికల్ పట్టణంలోని బేతని హాస్పిటల్‌లో కాలుకు గాయం కాగా చికిత్స చేయించుకున్నారు. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న నర్సు కాలం చెల్లిన ఆయింట్‌మెంట్ ఇవ్వడంతో ఆదివారం జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

✦మంత్రి ఈశ్వర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

పెగడపల్లి: మండలంలోని ఆరవెల్లి, బతికపల్లి మార్గ మాధ్యంలో ఉన్న రహదారిపై కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం నాయకులు, రైతులు మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సర్పంచ్ ఉప్పులంచె లక్ష్మన్, ఎంపీటీసీ గంగారెడ్డి పాల్గొన్నారు.

✦విద్యార్థుల జోష్

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని మానస హైస్కూల్‌లో వార్షికోత్సవం ఘనంగా జరిగింది. చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టర్ శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు, మౌనికారావు, సుమన్‌రావు, ప్రిన్సిపాల్ రజితారావు పాల్గొన్నారు.

✦అభివృద్ధి పనులకు నిధులు

బుగ్గారం: మండలంలోని మద్దునూర్ గ్రామంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రూ.10లక్షలు మంజూరైనట్లు సర్పంచ్ బత్తుల తిరుపతి తెలిపారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు ఈ నిధులు మంజూరైట్లు తెలిపారు. నిధులు మంజూరుకు కృషి చేసిన మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

✦యువత సన్మార్గంలో ముందుకెళ్లాలి

మల్లాపూర్: యువత సన్మార్గంలో ముందుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాంబారి ప్రభాకర్ సూచించారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని వీవీరావుపేటలో నిర్వహించిన క్రీడాకారుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. టీషర్టు(జెర్సీ)లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బైన ప్రశాంత్, బీజేపీ ఓబీసీ మండల అధ్యక్షుడు వేముల నరేశ్, మండల ఉపాధ్యక్షుడు మిట్టపెల్లి దివాకర్‌రెడ్డి, వీవీరావుపేట క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు



బోనాలతో మహిళలు

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామంలో ఆదివారం మల్లన్న స్వామికి గ్రామంలోని యాదవులు, వివిధ కుల సంఘాలు చెందిన మహిళలు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు



రక్తదానం చేస్తున్న సభ్యులతో మున్సిపల్ చైర్మన్

రాయికల్: రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. ఈ మేరకు ఆదివారం ముస్లిం సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన 46 మందిని, ముస్లిం సెంట్రల్ కమిటీ సభ్యులను అభినందించారు. కౌన్సిలర్ తురగ శ్రీధర్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు మున్ను, ప్రధాన కార్యదర్శి మోబిన్, కోశాధికారి జమీర్‌ఖాన్, జమాత్ ఇస్లామీ అధ్యక్షుడు నబీసహాబ్ జైనుద్దీన్, నాయకులు షాకీర్, సోహైల్, ఫుజల్ రహీం, సల్మాన్, షకీల్, సాబీర్ పాల్గొన్నారు.

అకాల వర్షం.. నేలవాలిన మొక్కజొన్న



పెంబట్లలో నేలవాలిన మొక్కజొన్న



వడగళ్లు చూపుతున్న రైతు

రాయికల్: మండలంలోని సింగరావుపేట, అల్లీపూర్, ఇటిక్యాల, రాయికల్, కుమ్మరిపెల్లి, భూపతిపూర్, తాట్లవాయి, కట్కాపూర్ గ్రామాల్లో అకాల వర్షం కురిసింది. దీంతో మొక్కజొన్న నేలవాలింది.

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో..

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో కురిసిన భారీ వర్షానికి ఆయా గ్రామాల్లో పంటలకు భారీ నష్టం జరిగింది. సారంగాపూర్ మండల కేంద్రంలో 20.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెంబట్ల, కోనాపూర్, రేచపల్లి, రంగపేట, నాగునూర్, లచ్చక్కపేట, లక్ష్మీదేవిపల్లి గ్రామాలతో పాటు, బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో వర్షానికి మొక్కజొన్న నేలవాలింది. మామిడి కాయలు, మిర్చి పంట నేలరాలాయి. నువ్వు, వరి పంటలకు స్వల్ప నష్టం వాటిల్లింది. పెంబట్లలో మొక్కజొన్న పంట నష్టంపై సర్వే చేపట్టాలని రైతు బండారి వెంకటేశ్ కోరాడు.

మల్యాలలో వడగళ్లవాన

మల్యాల: మండలంలోని మల్యాల, ముద్దుట్ల, మల్యాల అడ్డరోడ్డు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం వడగళ్ల వర్షం కురిసింది. కాగా శనివారం తెల్లవారుజామున సుమారు 50.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ సుజాత తెలిపారు. వరి పంట పొట్టదశలో ఉంది. వడగళ్ల వాన కురవడంతో గింజలు రాలిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రూప్–1 పేపర్ లీకేజీ బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యమే



ఇబ్రహీంపట్నంలో దిష్టిబొమ్మ దహనం



మెట్‌పల్లిలో..

ఇబ్రహీంపట్నం: టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 1 పేపర్ లీక్ ముమ్మాటికీ బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యమేనని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గంగాధర్ పాల్గొన్నారు.

పెగడపల్లి: పెగడపల్లిలో కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. మండల కేంద్రంలోని సహకార బ్యాంకు నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడి మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఆదివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి పాల్గొన్నారు.

ధర్మపురి: పట్టణంలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.దినేశ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సింహరాజు ప్రసాద్ ఉన్నారు.

కథలాపూర్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాల లీక్‌పై బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీరుపై మండిపడుతూ కథలాపూర్‌లో యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జవ్వాజి చౌదరి, ఎన్‌ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు సంతోష్ పాల్గొన్నారు.

మేడిపెల్లి: మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాలు లీక్ చేసిన కారకులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.